# తల్లాడలో మెగా హెల్త్ క్యాంప్‌కు విశేష స్పందన

## 325 మందికి వైద్య సేవలు.. 57 మందికి రిఫరల్



**తల్లాడ/ మార్చి 31 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన మెగా హెల్త్ క్యాంప్‌కు గ్రామ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మొత్తం 325 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేసినట్లు పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ ప్రత్యూష తెలిపారు.గ్రామ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు శిబిరాన్ని ప్రారంభించగా, ఖమ్మం నుంచి వచ్చిన నిపుణులైన వైద్యులు వివిధ విభాగాల్లో సేవలు అందించారు. సాధారణ వైద్యంలో 153 మంది, గైనకాలజీ విభాగంలో 62 మంది, చిన్నపిల్లల విభాగంలో 43 మంది, ఆర్థోపెడిక్స్‌లో 75 మంది, కంటి విభాగంలో 56 మంది, దంత విభాగంలో 15 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.గైనకాలజీ విభాగంలో పాప్‌స్మియర్ పరీక్ష నిర్వహించడంతో పాటు టీ–హబ్ ద్వారా 64 నమూనాలు సేకరించారు. టిబి ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా అనుమానితులైన 62 మందికి ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించి, 50 మందికి స్పుటం నమూనాలు సేకరించారు.తీవ్ర అనారోగ్య సమస్యలు ఉన్న 57 మందిని మెరుగైన చికిత్స కోసం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. శిబిరం ద్వారా గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలతో పాటు ఆరోగ్యంపై అవగాహన కల్పించినట్లు వైద్యులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అంబటి శ్రీధర్ రాజు, డిప్యూటీ తహసీల్దార్ రెహమాన్, ఎస్సై బి. వెంకటేష్, సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు (చిన్నబ్బాయి), ఉపసర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలకు రోటరీ క్లబ్ అండ అభినందనీయం

**- మండల విద్యాశాఖ అధికారి మామునూరు శ్రీధర్ - వర్ధన్నపేట పాఠశాలకు 1.40 లక్షల విలువైన సామగ్రి పంపిణీ**





**వర్ధన్నపేట/ మార్చి 31(జర్నలిస్ట్ వార్త):** సమాజంలో పేద విద్యార్థులు అభ్యసించే ప్రభుత్వ పాఠశాలలకు రోటరీ క్లబ్ వంటి స్వచ్ఛంద సంస్థలు అండగా నిలవడం ఎంతో అభినందనీయమని వర్ధన్నపేట మండల విద్యాశాఖ అధికారి మామునూరు శ్రీధర్ కొనియాడారు. మంగళవారం వర్ధన్నపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హైదరాబాద్ జూబ్లీహిల్స్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వితరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ప్రతినిధులు ఆర్టీఎన్. వి. బాలకోటి రెడ్డి, కళ్యాణ్ పొంగులూరి, లక్ష్మీ విసిరెడ్డి, డాక్టర్ బాలకోటయ్యల చేతుల మీదుగా పాఠశాలకు అవసరమైన సుమారు రూ 1,40,000 విలువైన ఫర్నిచర్, టేబుల్స్, ఫ్యాన్లు, సౌండ్ సిస్టం, ఆల్మారాలు, బీరువాలు మరియు విద్యార్థులకు నోట్ బుక్స్‌ను అందజేశారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగవెల్లి రవీందర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రోటరీ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు ప్రధానమైన పిల్లర్ల వంటి వారని, విద్యార్థులకు కేవలం అక్షరజ్ఞానమే కాకుండా విలువలతో కూడిన విద్యను అందించాలని కోరారు. చదువు ఉద్యోగ అవకాశాలను కల్పిస్తే, సంస్కారం మరియు విలువలు జీవితాన్ని నిలబెడతాయని వారు సూచించారు. ఇక్కడి విద్యార్థులు చాలా చురుగ్గా ఉన్నారని, వారిని మరింత ఉన్నత శిఖరాలకు తీర్చిదిద్దాలని కోరారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కాయిత శ్రీనివాస్, ఉపాధ్యాయులు బూర్యాల బెట్రీస్, డి. రాజకుమారి, ఎం. అనిత, ఎండి. రహీం, టి. శ్రీనివాస్, జి. సురేష్, సర్వ సుల్తానా, రిజ్వాన, గాయల సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# దొంగను పట్టుకున్న గ్రామస్తులు.. సొత్తు రికవరీ

**బంగారం, వెండి, నగదు స్వాధీనం.. పోలీసులకు అప్పగింత**







**ఎల్కతుర్తి /మార్చి 31 (జర్నలిస్ట్ వార్త):** ఎల్కతుర్తి మండల కేంద్రంలో దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని గ్రామస్తులు చాకచక్యంగా పట్టుకుని పోలీసులకు అప్పగించిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. బాధితురాలు నరిగె సంధ్య ఫిర్యాదు మేరకు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.సంధ్య భర్త రవి (40), వ్యవసాయ కూలీ. వీరు ఇంటికి తాళం వేసి బ్యాంకుకు వెళ్లి తిరిగి వచ్చేసరికి తాళాలు పగులగొట్టి బంగారం, వెండి, నగదు దొంగిలించినట్లు గుర్తించారు. ఈ విషయం గమనించిన సంధ్య అరవడంతో అప్రమత్తమైన గ్రామస్తులు వెంటనే దొంగను వెంబడించి పట్టుకున్నారు.దొంగను అదుపులోకి తీసుకుని చితకబాదిన గ్రామస్తులు, అతని వద్ద ఉన్న నగదు, బంగారం స్వాధీనం చేసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. సమాచారం అందుకున్న ఎస్సై ప్రవీణ్ కుమార్ ఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి దర్యాప్తు ప్రారంభించారు.బాధితురాలి ఫిర్యాదు ప్రకారం సుమారు 9.84 గ్రాముల బంగారం, 214.100 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.20 వేల నగదుదొంగిలించబడినట్లు వెల్లడైంది. స్వాధీనం చేసుకున్న సొత్తును త్వరలో బాధితులకు అందజేస్తామని పోలీసులు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్సై ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, ఇళ్లను ఖాళీగా వదిలి బయటకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, అవసరమైతే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

దొంగను చాకచక్యంగా పట్టుకున్న గ్రామస్తులను పోలీసులు అభినందించారు.

# అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

## ఏప్రిల్ 2లోపు దరఖాస్తు చేయాలి: ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్





**నర్సంపేట/మార్చి 31 (జర్నలిస్ట్ వార్త):** ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), నర్సంపేటలో 202526 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ తెలిపారు.

కళాశాలలో అర్థశాస్త్ర విభాగంలో ఒక గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టు, చరిత్ర విభాగంలో ఒక గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అభ్యర్థులు పీజీలో ఓసీ, బీసీ వర్గాలకు కనీసం 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు 50 శాతం మార్కులు సాధించి ఉండాలి.అదనంగా పీహెచ్‌డీ/నెట్/సెట్/స్లెట్ అర్హతలు కలిగి, బోధన అనుభవం ఉన్న అభ్యర్థులకు ఎంపికలో ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు.అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటా, విద్యార్హతల ధ్రువపత్రాలతో కలిసి ఏప్రిల్ 2, 2026 సాయంత్రం 4 గంటల లోపు కళాశాలలో సమర్పించాలని సూచించారు.

# తల్లాడను అసెంబ్లీగా ప్రకటించాలి

## తెలుగుదేశం నాయకుడు నారపోగు ప్రసాద్ డిమాండ్






**తల్లాడ/మార్చి 31 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలాన్ని ప్రత్యేక అసెంబ్లీ నియోజకవర్గంగా ప్రకటించాలని తెలుగుదేశం పార్టీ నాయకుడు నారపోగు ప్రసాద్ డిమాండ్ చేశారు. మండలంలో 27 గ్రామపంచాయతీలు ఉండగా, ప్రజల ఆకాంక్ష మేరకు తల్లాడ ప్రాంతాన్ని శాసనసభ నియోజకవర్గంగా పరిగణించాలని కోరారు.దేశంలో నియోజకవర్గాల పునర్విభజన నేపథ్యంలో కొత్త నియోజకవర్గాల ఏర్పాటుకు అవకాశాలు ఉన్నాయని, ఈ క్రమంలో తల్లాడకు అవసరమైన అన్ని అర్హతలు ఉన్నాయని తెలిపారు. జనాభా పెరుగుదలతో ప్రజాప్రతినిధుల ప్రాతినిధ్యం పెంచాల్సిన అవసరం ఉందన్నారు.భౌగోళికంగా, చారిత్రకంగా, సాంస్కృతికంగా తల్లాడ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు ఉందని వివరించారు. భద్రాచలం, విజయవాడ, ఖమ్మం వంటి ప్రముఖ క్షేత్రాల మధ్య ఉన్న తల్లాడ ప్రాంతం అభివృద్ధి చెందడానికి అసెంబ్లీ హోదా కీలకమని అభిప్రాయపడ్డారు.పాడిపంటలకు పుట్టినిల్లుగా పేరుగాంచిన ఈ ప్రాంతంలో మామిడి, ప్రత్తి, వరి, వేరుశనగ, మిరప, చెరకు వంటి పంటలు విస్తారంగా పండుతున్నాయని పేర్కొన్నారు. చెరువులు, సాగునీటి వనరులు సమృద్ధిగా ఉండటంతో వ్యవసాయానికి అనుకూల పరిస్థితులు ఉన్నాయని తెలిపారు.కల్లూరు, పెనుబల్లి మండలాలతో పాటు ఎన్కూరు ప్రాంతాలను కలుపుకుని తల్లాడను కొత్త అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఈ డిమాండ్‌పై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు.

# ధాన్యపు కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

**-జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి రాంరెడ్డి హెచ్చరిక**





**వరంగల్/ మార్చి 31(జర్నలిస్ట్ వార్త);** వరి ధాన్యపు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు నాణ్యతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని, నిబంధనలు అతిక్రమిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాంరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం వరంగల్ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో రాణి రుద్రమదేవి జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో పర్వతగిరి మండల ధాన్యపు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, కంప్యూటర్ నిర్వాహకులు, కేంద్రాల బాధ్యులకు నిర్వహించిన ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రైతులు మధ్యవర్తుల చేతిలో మోసపోకుండా, వారికి గిట్టుబాటు ధర కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం పల్లె పల్లెనా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని ఆయన పేర్కొన్నారు. కేటాయించిన మిల్లులకే ధాన్యాన్ని సకాలంలో తరలించాలని నిర్వాహకులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, నీడ వంటి కనీస సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. కేంద్రాల బాధ్యులు అత్యంత నిబద్ధతతో వ్యవహరించాలని, రైతులకు అండగా నిలవాలని సూచించారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి. నాణ్యత విషయంలో రాజీ పడకూడదు, అదే సమయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం మన్నారు.

ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిణి రేణుకాదేవి, మార్కెటింగ్ విభాగపు జిల్లా పర్యవేక్షకులు దాసు, ఇతర పర్యవేక్షకులు రేవతి, వరలక్ష్మి, జిల్లా సమాఖ్య ప్రతినిధులు రజిత, స్వప్న, ఉమ, సహాయ పర్యవేక్షకులు సుధాకర్, రాజీరు, క్షేత్రస్థాయి సిబ్బంది గోలి కొమురయ్య, సుధాకర్, శ్యాంసన్ మరియు పర్వతగిరి మండలంలోని గ్రామ సంఘాల సహాయకులు మహేశ్వరి, నర్మద, జ్యోతి, రాధిక, రేణుక తదితరులు పాల్గొన్నారు.

# హుస్నాబాద్ డిపోలో డ్రైవర్ చక్రపాణికి ఘన వీడ్కోలు





**భీమదేవరపల్లి/మార్చి31 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ గ్రామానికి చెందిన మాడుగుల చక్రపాణి టీఎస్‌ఆర్టీసీ డ్రైవర్‌గా మూడు దశాబ్దాల పాటు విశిష్ట సేవలు అందించి మంగళవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ డిపోలో ఆర్టీసీ యాజమాన్యం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సహోద్యోగులు, అధికారులు చక్రపాణిని శాలువాతో సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు. డిపో మేనేజర్ వెంకన్న మాట్లాడుతూ 1996లో ఉద్యోగంలో చేరిన చక్రపాణి 30 సంవత్సరాల పాటు అదే డిపోలో క్రమశిక్షణతో విధులు నిర్వహించి అందరికీ ఆదర్శంగా నిలిచారని తెలిపారు. ఉత్తమ డ్రైవర్‌గా 12 సార్లు అవార్డులు అందుకోవడం ఆయన సేవాభావం, నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా విశ్రాంతి జీవితం గడపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సహోద్యోగులు, స్నేహితులు ఆయన భవిష్యత్తులో ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# జీలుగుల గ్రామంలో సీసీ రోడ్ల పనులకు శ్రీకారం

## సర్పంచ్ సృజన రాజు ఆధ్వర్యంలో ప్రారంభం



**జీలుగుల/మార్చి 31 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని జీలుగుల గ్రామంలో గ్రామ అభివృద్ధి పనుల్లో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ పనులను సర్పంచ్ ఘనబోయిన సృజన రాజు శ్రీకారం చుట్టారు.గ్రామంలో అంతర్గత రహదారులు, మురికి కాలువలు వంటి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని సర్పంచ్ తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇచ్చి, నిర్ణీత కాలంలో పూర్తి చేస్తామని పేర్కొన్నారు.రాబోయే రోజుల్లో గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని సృజన రాజు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గూటామ్ జోగిరెడ్డి, మాజీ సర్పంచ్ రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు

